క్లుప్తంగా

రైతు భరోసాకు దరఖాస్తు చేసుకోవాలి

వేలేరు : రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న రైతు భరోసా పథకానికి కొత్తగా పట్టాదారు పాస్‌బుక్కులు పొందిన రైతులు దరఖాస్తులు చేసుకోవాలని ఏఓ కవిత గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. పట్టాపాస్‌బుక్కు, ఆధార్ కార్డు, బ్యాంక్ పాస్‌బుక్కు జిరాక్స్‌లను ఆయా క్లస్టర్‌కు సంబంధించిన ఏఈఓలకు అందించాలని సూచించారు. గతంలో రైతు భరోసా నిధులు వస్తున్న వారు మళ్లీ దరఖాస్తు చేయాల్సిన అవసరం లేదని పేర్కొన్నారు.

చర్య తీసుకోవాలి

శాయంపేట : మండలంలోని తహరాపూర్‌లో పంచాయతీ కార్యదర్శిగా విధులు నిర్వర్తిస్తున్న తనపై దుర్భాషలాడిన వ్యక్తిపై చర్య తీసుకోవాలని పంచాయతీ కార్యదర్శి అజయ్ గురువారం శాయంపేట పోలీస్ స్టేషన్‌లో ఎస్సై జక్కుల పరమేశ్‌కు ఫిర్యాదు చేశారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. తహరాపూర్ గ్రామంలో మూడేళ్లుగా పంచాయతీ కార్యదర్శిగా విధులు నిర్వహిస్తున్నానని, బుధవారం గ్రామానికి చెందిన పిట్ట సుమన్ 955047439 నంబర్ నుంచి ఫోన్ చేసి గ్రామంలోని కుమ్మరికుంట నుంచి కొందరు మొరం తరలిస్తున్నారని, నువ్వు ఏమి చేస్తున్నావని దుర్భాషలాడినట్లు ఫిర్యాదులో పేర్కొన్నారు. దీంతో తాను తహసీల్దార్‌కు ఫిర్యాదు చేశానని చెప్పుతున్నా వినకుండా ఇష్టానుసారంగా మాట్లాడినట్లు తెలిపారు. దీంతో పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు తెలిపారు.

దరఖాస్తుల ఆహ్వానం

కమలాపూర్ : మండల కేంద్రంలోని బీసీ బాలుర వసతి గృహంలో ప్రవేశాల కోసం దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు వసతి గృహ సంక్షేమాధికారి కట్టయ్య గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. 3వ తరగతి నుంచి పదో తరగతి చదివే బీసీ విద్యార్థులు దరఖాస్తు చేసుకోవాలని, వారితోపాటు ఇతరులకు కూడా ప్రభుత్వం నిర్దేశించిన పరిమిత సీట్లలో ప్రవేశానికి అనుమతి ఉందని తెలిపారు. ఆసక్తి గల విద్యార్థులు కుల, ఆదాయ సర్టిఫికేట్లు (ఒరిజినల్) పాటు ఆధార్, రేషన్ కార్డు జిరాక్స్ ప్రతులు, రెండు పాస్ పోర్టు సైజు ఫొటోలు తీసుకుని నేరుగా హాస్టల్‌కు రావాలని సూచించారు. ఈ అవకాశాన్ని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

ఇందిరమ్మ ఇళ్లను వినియోగించుకోవాలి

ఆత్మకూరు : ఇందిరమ్మ ఇళ్లను లబ్ధిదారులు వినియోగించుకోవాలని పీఏసీఎస్ మాజీ చైర్మన్ ఏరుకొండ రవీందర్‌గౌడ్ సూచించారు. మండల కేంద్రంలో గురువారం ఇందిరమ్మ ఇళ్లకు ముగ్గులు పోసి మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం పేదల సొంతింటి కల సాకారం చేస్తోందన్నారు. కాంగ్రెస్ మండల వర్కింగ్ ప్రెసిడెంట్‌లు వాసు, కిరీటి, యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు సందీప్, నాయకులు జైపాల్‌రెడ్డి, కిరణ్, రాజు, మహేందర్ పాల్గొన్నారు.

రైతు ప్రాణం తీసిన అప్పుల భారం

- గతంలో చేసిన అప్పు తీర్చలేక.. ప్రస్తుతం విత్తనాలు కొనలేక మనోవేదన



అశోక్ (ఫైల్)

ఐనవోలు : వ్యవసాయన్నే నమ్ముకున్న గతంలో వరి పంట సాగు చేసేందుకు రూ.5 లక్షలు అప్పు తెచ్చాడు. దురదృష్టవశాత్తు పంట దిగుబడి రాకపోవడంతో తెచ్చిన అప్పు భారంగా మారింది. ప్రస్తుతం విత్తనాలు కొనుగోలు చేసేందుకు డబ్బులు లేకపోవడం.. పెళ్లికి ఎదిగిన కూతురి భవిష్యత్ గురించి ఆలోచించిన సదరు రైతు.. భార్యతో తన బాధను పంచుకుని చేను వద్దకు వెళ్తున్నానని చెప్పి అక్కడే పురుగులమందు తాగి బలవన్మరణానికి పాల్పడ్డాడు. ఈ సంఘటన మండలంలోని పంథినిలో గురువారం చోటుచేసుకుంది. ఎస్సై శ్రీనివాస్ తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన సట్ల అశోక్ (46) వ్యవసాయంతో పాటు గీత కార్మికుడిగా పనిచేస్తూ జీవనం సాగిస్తున్నాడు. అతడికి భార్య మంజుల, కుమారుడు వినయ్, కుమార్తె అఖిల ఉన్నారు. తనకున్న రెండు ఎకరాల భూమిలో వ్యవసాయం చేస్తుండగా సరైన దిగుబడి రాకపోవడంతో సుమారు రూ.5లక్షల అప్పు అయ్యాడు. అప్పులు తీర్చలేక, ఈ ఏడాది విత్తనాలు కొనుగోలు చేసేందుకు డబ్బులు లేకపోవడంతో తీవ్ర మనోవేదనకు గురయ్యాడు. కూతురు పెళ్లికి ఎదిగిందని, నేను బతికి ఉండి ఏమి సాధించలేనని భార్యకు చెప్పుకుంటూ ఇటీవల కంటతడి పెట్టుకోగా ఆమె ధైర్యం చెప్పింది. కాగా ఈనెల 10న సాయంత్రం అశోక్ చెలుక వద్దకు వెళ్తున్నానని భార్యకు చెప్పి వెళ్లాడు. తిరిగి రాకపోవడంతో చుట్టుపక్కల వెతికినా జాడ తెలియలేదు. గురువారం సాయంత్రం ఓ వ్యవసాయ క్షేత్రంలో పడి ఉన్నాడని సమాచారం రాగా కుటుంబ సభ్యులు వెళ్లి చూడగా ముక్కు, చెవిలో నుంచి నురగ వచ్చి, శరీరం మొత్తం బొబ్బలు ఉన్నట్లు తెలిపారు. రెండు రోజుల క్రితం పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకున్నట్లు అనుమానం ఉందన్నారు. అశోక్ మృతిపై ఎవరిపై అనుమానం లేదని, అప్పుల బాధతో మనస్థాపానికి గురై పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకున్నట్లు భార్య మంజుల ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

ప్రభుత్వ పాఠశాలల్లోనే మెరుగైన విద్య

- జెడ్పీ సీఈఓ విద్యాలత, ఆర్డీఓ నారాయణ
- పండుగ వాతావరణంలో పాఠశాలల పునఃప్రారంభం
- విద్యార్థులను స్వాగతించిన అధికారులు



విద్యార్థులకు స్వాగతం పలుకుతున్న ఆర్డీఓ నారాయణ, అధికారులు



ధర్మసాగర్ : నూతన విద్యార్థులకు స్వాగతం పలుకుతున్న ఎంపీడీఓ



ఎల్కతుర్తి : విద్యార్థులకు యూనిఫామ్, బుక్స్ పంపిణీ చేస్తున్న ఎంపీడీఓ విజయ్‌కుమార్



కమలాపూర్ : యూనిఫామ్, పాఠ్య పుస్తకాలు పంపిణీ చేస్తున్న జెడ్పీ సీఈఓ విద్యాలత



శాయంపేట : బడిబాటలో పాల్గొన్న జయంతి

కమలాపూర్ : ప్రభుత్వ పాఠశాలల్లోనే అనుభవజ్ఞులైన ఉపాధ్యాయులతో మెరుగైన విద్యాబోధన అందుతోందని, తల్లిదండ్రులు తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లోనే చేర్పించాలని హనుమకొండ జెడ్పీ సీఈఓ విద్యాలత కోరారు. మండలంలోని భీంపల్లి ప్రాథమిక పాఠశాలలో గురువారం పాఠశాలల పునఃప్రారంభ కార్యక్రమానికి ఆమె హాజరై పాఠశాలలోని మౌలిక వసతులు, పిల్లలకు అందిస్తున్న పౌష్టికాహారం, పాఠశాల పరిసరాలను, అంగన్‌వాడీ కేంద్రంలోని పిల్లలకు అందిస్తున్న పౌష్టికాహారం, విద్యా విధానాన్ని పరిశీలించారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. 14 ఏళ్ల లోపు పిల్లలందరు విధిగా ప్రభుత్వ పాఠశాలల్లోనే చదువుకునేలా ఉపాధ్యాయులు ఇంటింటికి వెళ్లి తల్లిదండ్రులకు అవగాహన కల్పించాలని సూచించారు. ప్రభుత్వ పాఠశాలల్లో కల్పిస్తున్న సౌకర్యాలు, ఉచిత పాఠ్య పుస్తకాలు, స్కూల్ యూనిఫామ్, మధ్యాహ్న భోజనం, సాంస్కృతిక, క్రీడలు తదితర అంశాలపై ప్రచారం చేయాలన్నారు. అనంతరం విద్యార్థులకు పాఠ్య పుస్తకాలు, స్కూల్ యూనిఫామ్ పంపిణీ చేశారు. అనంతరం పాఠశాల ఆవరణలో మురుగునీరు నిల్వకుండ ఉపాధి హామీ పథకం ద్వారా ఇంకుడుగుంత నిర్మాణానికి ముగ్గు పోశారు. ఎంపీడీఓ గుండె బాబు, ఎంఈఓ శ్రీధర్, స్కూల్ కాంప్లెక్స్ హెచ్‌ఎం వాణి, హెచ్‌ఎం వీరస్వామి, ఉపాధ్యాయులు, అంగన్‌వాడీ టీచర్లు, పంచాయతీ కార్యదర్శి, ఉపాధి హామీ సిబ్బంది, స్వశక్తి సంఘాల మహిళలు, తల్లిదండ్రులు, విద్యార్థులు పాల్గొన్నారు.

నడికూడ : మండలంలోని పులిగిల్ల ప్రాథమిక పాఠశాలలో గురువారం నిర్వహించిన నూతన విద్యా సంవత్సర ప్రారంభోత్సవంలో పరకాల ఆర్డీఓ నారాయణ పాల్గొని పాఠశాలకు వచ్చే విద్యార్థులకు ఘన స్వాగతం పలికారు. ప్రభుత్వ పాఠశాలల్లో అనేక వసతులు ఉన్నాయని, గ్రామీణ ప్రాంత విద్యార్థులు వినియోగించుకోవాలని సూచించారు. పాఠ్యపుస్తకాలు, యూనిఫామ్ పంపిణీ చేశారు.

గ్రామానికి చెందిన ఎనుగాల విజయ్, సుష్మ, రతన్ పాఠశాలకు రూ.1.20 లక్షల విలువచేసే 30 డ్యూయల్ డెస్కులను అందించగా ఆయన శాలువాతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ రవీందర్ రెడ్డి, మండల స్పెషల్ ఆఫీసర్ నవీన్‌కుమార్, ఎంపీడీఓ విమల, ఎంఈఓ హనుమంతరావు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పరకాల : ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలు గురువారం పునఃప్రారంభం అయ్యాయి. విద్యార్థుల రాకతో పాఠశాలల ఆవరణాలు సందడిగా మారాయి. మండలంలోని పోచారం గ్రామంలో గల అంగన్‌వాడీ చిన్నారులకు ఆర్డీఓ డాక్టర్ నారాయణ, వివిధ ప్రభుత్వ, ప్రైవేటు విద్యాసంస్థల ఉపాధ్యాయులు విద్యార్థులకు పూలు అందించి స్వాగతం పలికారు. పట్టణంలోని వెలమవాడ ప్రభుత్వ పాఠశాలలో మాజీ కౌన్సిలర్ మార్క ఉమాదేవి చేతుల మీదుగా పాఠ్య పుస్తకాలు, దుస్తులు పంపిణీ చేయగా.. వెల్లంపల్లిలో ఎంఈఓ రమాదేవి చేతుల మీదుగా పుస్తకాలు, దుస్తులు పంపిణీ చేశారు. మాజీ సర్పంచ్ కృష్ణ, మాజీ ఎంపీపీ స్వర్ణలత పాల్గొన్నారు.

ఎల్కతుర్తి : ప్రైవేటు పాఠశాలలకు దీటుగా ప్రభుత్వ పాఠశాలల్లో మెరుగైన విద్య అందుతుందని ఎంపీడీఓ విజయ్‌కుమార్ అన్నారు. వేసవి సెలవులు ముగిసిన అనంతరం గురువారం పాఠశాలలు పునఃప్రారంభంకాగా మండల కేంద్రంలోని ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులకు యూనిఫామ్, బుక్స్ పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఎంఈఓ చదువుల సత్యనారాయణ, విద్యార్థుల తల్లిదండ్రులు, అమ్మ ఆదర్శ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

శాయంపేట : మండలంలోని ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్యను పెంచాలని హనుమకొండ జిల్లా సంక్షేమ అధికారి, మండల స్పెషల్ ఆఫీసర్ జయంతి కోరారు. మైలారంలో ప్రభుత్వ ప్రాథమికోన్నత పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు ఆచార్య జయశంకర్ బడిబాట కార్యక్రమం గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె పాల్గొని మాట్లాడారు. బడీడు పిల్లలను ప్రభుత్వ పాఠశాలలో చేర్పించాలని కోరారు. ఎంపీడీఓ ఫణిచంద్ర, సీడీపీఓ స్వాతి, ఎంఈఓ భిక్షపతి, పాఠశాల ప్రధానోపాధ్యాయుడు మనోజ్‌కుమార్, ఉపాధ్యాయులు నాగ సుభాషిణి, సంధ్యారాణి, రమేశ్, అరుణ్‌కుమార్, విద్యార్థులు పాల్గొన్నారు.

మొదటి రోజు నామమాత్రమే..

పాఠశాలలు పునఃప్రారంభంకాగా మండలంలోని ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులు అంతంత మాత్రంగానే హాజరయ్యారు. మండలంలోని 26 ప్రభుత్వ పాఠశాలల్లో 789 మంది విద్యార్థులకు గాను 284 మంది విద్యార్థులు హాజరు కాగా, కస్తూర్బా 300 మంది విద్యార్థులకు 10 మంది, మహాత్మా జ్యోతిబాపూలే పాఠశాలలో 480 మంది విద్యార్థులకు ఒకరు, సాంఘిక సంక్షేమ బాలికల గురుకుల పాఠశాలలో 525మంది విద్యార్థులకు 25మంది విద్యార్థులు హాజరయ్యారు.

ధర్మసాగర్ : మండలంలోని ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులను చేర్పించి సమోదును పెంచాలని ఎంపీడీఓ అనిల్ కుమార్ సూచించారు. మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ బాలికలు, బాలుర ఉన్నత పాఠశాలల్లో గురువారం పాఠశాల పున:ప్రారంభంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ప్రభుత్వ పాఠశాలల్లో సదుపాయాలను వివరించారు.

వృథాగా మిషన్ భగీరథ నీరు



రోడ్డుపై పారుతున్న నీరు

శాయంపేట : మండల కేంద్రంలోని శాయంపేట నుంచి కొత్తగట్టు సింగారం గ్రామానికి వెళ్లే బైపాస్ రోడ్డు పక్కన మిషన్ భగీరథ పైపులైన్ లీకేజీతో నీరంతా వృథాగా పోతోంది. గతంలో గ్రామంలో పలు చోట్ల లీకేజీకాగా సంబంధిత అధికారులు తూతూ మంత్రంగా మరమ్మతులు చేసి చేతులు దులుపుకొన్నారని విమర్శలు వస్తున్నాయి. రెండు, మూడు రోజుల నుంచి మిషన్ భగీరథ పైప్‌లైన్ లీకేజీ అవుతోందని, మిషన్ భగీరథ ఆపరేటర్లు చూసీచూడనట్లు వ్యవహరిస్తున్నారని స్థానికులు మండిపడుతున్నారు. వరద నీరు రోడ్డుపై నిల్వ ఉండడంతో ద్విచక్ర వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. వెంటనే అధికారులు స్పందించాలని పలువురు కోరుతున్నారు.

గుర్తుతెలియని వ్యక్తి మృతదేహానికి ఖననం



గుర్తుతెలియని మృతదేహాన్ని ఖననం చేసేందుకు తరలిస్తున్న మున్సిపల్ సిబ్బంది

పరకాల : గుర్తు తెలియని మృతదేహాన్ని మున్సిపల్ సిబ్బంది గురువారం చలివాగు శ్మశానవాటిక సమీపంలో ఖననం చేశారు. వివరాలు ఇలా ఉన్నాయి. రేగొండ మండలం రామన్నగూడెంతండా గ్రామ శివారులో ఈనెల 6న గుర్తు తెలియని పురుష మృతదేహం కుళ్లిపోయే స్థితిలో లభ్యమైంది. ఒంటిపైనా ఏలాంటి గాయాలు లేకుండా ఉన్న మృతుడి వివరాల కోసం రేగొండ పోలీసులు ప్రయత్నించినా ఫలితం లేకపోవడంతో పోస్టుమార్టం నిర్వహించగా పోలీసుల సమక్షంలో మున్సిపల్ సిబ్బంది ఖననం చేశారు.

ప్రమాదాల నివారణ అందరి బాధ్యత

ఇన్‌స్పెక్టర్ హరికృష్ణ



చెట్లు, ముళ్ల పొదలను తొలగిస్తున్న యూత్ నాయకులు, ఇన్‌స్పెక్టర్ హరికృష్ణ

కమలాపూర్ : ప్రమాదాల నివారణ అందరి బాధ్యత అని ఇన్‌స్పెక్టర్ హరికృష్ణ అన్నారు. మండలంలోని ఉప్పల్ నుంచి భీంపల్లి, కన్నూరు గ్రామాలకు వెళ్లే రోడ్డు పక్కన చెట్లు, ముళ్ల పొదలు ఏపుగా పెరగడంతో తరచూ ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి. దీంతో ఉప్పల్‌కు చెందిన గ్రామ యువకులు ఈ విషయాన్ని ఆయన దృష్టికి తీసుకెళ్లగా స్పందించిన ఇన్‌స్పెక్టర్ ఉప్పల్ గ్రామ యువత సహకారంతో రోడ్డు పక్కన ప్రమాదకరంగా ఉన్న చెట్లు, ముళ్ల పొదలను జేసీబీ, దోజర్లతో గురువారం తొలగింపజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ప్రమాదాల నివారణ కోసం పోలీసు శాఖ ఆధ్వర్యంలో ఇప్పటికే అనేక చర్యలు చేపడుతున్నామని అన్నారు. ప్రమాదాల నివారణ కోసం యువత సహకారంతో మరిన్ని కార్యక్రమాలు, చర్యలు చేపట్టనున్నట్లు వెల్లడించారు. యూత్ నాయకులు మొండెద్దుల నాగరాజు, పసునూటి రాణాప్రతాప్, కొయ్యడ రాజు, తాళ్ల శ్రీధర్, నద్దునూరి పరమేశ్, జెట్టి రాములు, ర్యాకం గట్టయ్య, అనిల్, అజయ్, చిరంజీవి, సాయి, రాకేశ్ తదితరులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీలో ఆటపాటలతో కూడిన విద్య

జిల్లా సంక్షేమ అధికారి జయంతి



పత్తిపాకలో ర్యాలీ నిర్వహిస్తున్న అంగన్‌వాడీలు

శాయంపేట : అంగన్‌వాడీ పాఠశాలలో 3 నుంచి 5 సంవత్సరాల పిల్లలకు ఆటపాటలతో కూడిన ప్రాథమిక విద్య అందిస్తున్నట్లు జిల్లా సంక్షేమ అధికారి జయంతి తెలిపారు. మండలంలోని మైలారం, పత్తిపాక గ్రామాల్లో అంగన్‌వాడీ కేంద్రాల్లో నిర్వహించిన అమ్మమాట-అంగన్‌వాడీ బాట కార్యక్రమానికి ఆమె ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. అంగన్‌వాడీ కేంద్రాల్లో పిల్లలకు ఒక్క పూట భోజనం అందిస్తూ ప్రతీ నెల పిల్లల పోషణ స్థితిని పర్యవేక్షించడం జరుగుతుందన్నారు. అంగన్‌వాడీ కేంద్రాలు పిల్లల శారీరక, మానసిక అభివృద్ధి కేంద్రాలుగా వ్యవహరిస్తున్నాయని అన్నారు. అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా అందిస్తున్న సేవలను గర్భిణులు, బాలింతలు వినియోగించుకోవాలని కోరారు. అనంతరం అంగన్‌వాడీ కేంద్రాల్లో కొత్తగా ఏర్పాటు చేస్తున్న ఎగ్ బిర్యానీ మెనూను ప్రారంభించారు. అలాగే పత్తిపాక గ్రామంలో అంగన్‌వాడీ టీచర్లు అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సీడీపీఓ స్వాతి, ఎంపీడీఓ ఫణిచంద్ర, ఎంఈఓ భిక్షపతి, హెచ్‌ఎం మనోజ్‌కుమార్, అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ చైర్మన్ మంజుల, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ సునీత, అంగన్‌వాడీ టీచర్లు రమాదేవి, హైమావతి, చంద్రకళ, రత్నమాల, స్వప్న, పోషణ అభియాన్ జిల్లా కోఆర్డినేటర్ పాల్గొన్నారు.

దళితుల భూమికి రక్షణ కల్పించాలి



మాట్లాడుతున్న రాజేందర్

ఆత్మకూరు : దళితుల భూమికి రక్షణ కల్పించాలని డీబీఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు చుంచు రాజేందర్ డిమాండ్ చేశారు. మండల కేంద్రంలోని హౌజుబుజుర్గులో కబ్జాకు గురైన దళితుల భూములను గురువారం డీబీఎఫ్ నాయకులు పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఎస్సీలకు ఎస్సీ కార్పొరేషన్ ద్వారా పంపిణీ చేసిన భూములను కొంతమంది కబ్జా చేశారని ఆరోపించారు. అధికారులు విచారణ చేపట్టి చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో ఆందోళన చేపడుతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ప్రజాసంఘాల జేఏసీ జిల్లా చైర్మన్ మాదాసి సురేశ్, ఎమ్మార్పీఎస్ మండల అధ్యక్షుడు రఘు, విశ్వరత్న సమాజ నిర్మాణ సంఘం వ్యవస్థాపక అధ్యక్షుడు పెండెల భిక్షపతి, నాయకులు సుధాకర్, సలీంపాషా, నవీన్, సారయ్య పాల్గొన్నారు.

బోరుమోటార్లను వినియోగంలోకి తేవాలి

డీపీఓకు బీసీ కాలనీ వాసులు వినతి

కమలాపూర్ : మండల కేంద్రంలోని బీసీ కాలనీలో ఆక్రమణకు గురైన రెండు బోర్లను వినియోగంలోనికి తీసుకొచ్చి నీటి ఎద్దడిని నివారించాలని కాలనీ వాసులు కోరారు. ఈ మేరకు గురువారం జిల్లా పంచాయతీ అధికారికి వినతిపత్రం అందించారు. అనంతరం వారు విలేకరులతో మాట్లాడారు. బీసీ కాలనీ (16వ వార్డు)కు చెందిన పద్మశాలి కులస్తులమని, గతంలో మంచినీటి ఎద్దడి నివారణ కోసం పంచాయతీ ఆధ్వర్యంలో బీసీ కాలనీలో రెండు బోర్లు వేశారని, అందులో ఒకదానికి మోటారు బిగించారని, మరొకదానికి చేతి పంపు బిగించారన్నారు. ఆ రెండు బోర్ల ద్వారా తాము నీటి అవసరాలు తీర్చుకునే వాళ్లమన్నారు. సుమారు నెల రోజుల క్రితం కమలాపూర్‌కు చెందిన మౌటం రాజు అనే రేషన్ దుకాణ డీలర్ ఆ బోర్లను దౌర్జన్యంగా ఆక్రమించుకుని గోడ నిర్మించుకున్నాడని ఆరోపించారు. దీంతో తాము నీళ్ల కోసం ఇబ్బందులు పడుతున్నామని చర్య తీసుకోవాలని కోరారు. కాలనీ వాసులు స్వరూప, రమ, లావణ్య, కావ్య, వీరలక్ష్మి, సరోజన, రాజవ్వ, లలిత, సాయి, శ్రీకాంత్, నవీన్, రాజేశ్, అప్పారావు ఉన్నారు.

రెవెన్యూ సదస్సును సందర్శించిన అడిషనల్ కలెక్టర్

ఎల్కతుర్తి : ప్రభుత్వం చేపట్టిన భూ భారతి కార్యక్రమంలో భాగంగా వల్బాపూర్‌లో గురువారం నిర్వహించిన రెవెన్యూ సదస్సును అడిషనల్ కలెక్టర్ వెంకట్‌రెడ్డి సందర్శించారు. రైతుల నుంచి ఎన్ని దరఖాస్తులు వచ్చాయని తహసీల్దార్ జగత్‌సింగ్‌ను తెలుసుకున్నారు. దరఖాస్తుల్లో వచ్చిన సమస్యపైన వెంటనే నోటీసులు జారీ చేయాలన్నారు. భూ సమస్యలను పరిష్కరించేందుకు ప్రభుత్వం భూ భారతి చట్టాన్ని తీసుకువచ్చిందన్నారు. దరఖాస్తుల స్వీకరణ అనంతరం వారికి నోటీసులు ఇచ్చి సమస్య పరిష్కరించేదుకు చర్యలు చేపట్టాలని అధికారులకు ఆదేశించారు. వల్బాపూర్‌లో నిర్వహించిన భూ భారతి రెవెన్యూ సదస్సులో 109 దరఖాస్తులు వచ్చినట్లు తహసీల్దార్ తెలిపారు. భీమదేవరపల్లి మండలం ముల్కనూరులో నిర్వహించిన రెవెన్యూ సదస్సులో 128 దరఖాస్తులు వచ్చినట్లు తహసీల్దార్ రాజేశ్ తెలిపారు.

మైలారంలో..

శాయంపేట : మండలంలోని మైలారం గ్రామంలో గురువారం రెవెన్యూ సదస్సు నిర్వహించినట్లు తహసీల్దార్ కల్వల సత్యనారాయణ తెలిపారు. 143 దరఖాస్తులు స్వీకరించినట్లు చెప్పారు.

ఆత్మకూరు : భూ భారతిని చట్టాన్ని సద్వినియోగం చేసుకోవాలని డిప్యూటీ తహసీల్దార్ భాస్కరమూర్తి రైతులకు సూచించారు. మండలంలోని కటాక్షపూర్‌లో గురువారం భూ భారతి రెవెన్యూ సదస్సు నిర్వహించి రైతుల నుంచి దరఖాస్తులు స్వీకరించారు.

పరకాల : మండలంలోని పోచారంలో గురువారం జరిగిన భూ భారతి రెవెన్యూ సదస్సులో 384 అర్జీలను స్వీకరించినట్లు తహసీల్దార్ విజయలక్ష్మి తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంఆర్ఐ దామోదర్, సర్వేయర్ విజయ్‌కుమార్, రెవెన్యూ సిబ్బంది, గ్రామస్తులు పాల్గొన్నారు.

విద్యుత్ శాఖ అధికారుల ఫోన్ నంబర్ల మార్పు

ఎల్కతుర్తి : ఎల్కతుర్తి విద్యుత్ శాఖ అధికారుల ఫోన్ నంబర్లు మార్పు అయినట్లు ఏఈ సుధాకర్ తెలిపారు. ఏఈ సుధాకర్ ఫోన్ నంబర్ 8712484601, సబ్ ఇంజనీర్ 8712484602, ఎల్ఐ ఎల్కతుర్తి 8712484594, ఎల్ఐ కోతులనడుమ 8712484598, లైన్‌మెన్ ఎల్కతుర్తి 8712484595, లైన్‌మెన్ దండేపల్లి 8712484592, లైన్‌మెన్ జీల్గుల 8712484597, లైన్‌మెన్ తిమ్మాపూర్ 8712484599, లైన్‌మెన్ దామెర 8 7 1 2 4 84593, లైన్‌మెన్ గోపాల్‌పూర్ 8712484596, సబ్ స్టేషన్ ఎల్కతుర్తి 8712484662, సబ్‌స్టేషన్ దండేపల్లి 8712484661, సబ్‌స్టేషన్ కోతులనడుమ 8712484669, సబ్‌స్టేషన్ తిమ్మాపూర్ 8712484600లో అందుబాటులో ఉంటారని తెలిపారు.

నడికూడ : మండంలో విద్యుత్ శాఖ అధికారుల ఫోన్ నంబర్లు మార్పు అయినట్లు ఏఈ ఇందూజ గురువారం ప్రకటనలో తెలిపారు. ఏఈ సముద్రల ఇందూజ 8712484647, ఎస్ఈ బి.రాహుల్ 8712484653, లైన్‌ఇన్‌స్పెక్టర్ డి.సుధాకార్ నడికూడ 8712484676, లైన్‌ఇన్‌స్పెక్టర్ బి.పుల్లయ్య వెంకట్‌పూర్ 8712484677, లైన్‌మెన్ కె.సత్యనారయణ వెంకట్‌పూర్ 8712484651, చర్లపల్లి సబ్ స్టేషన్ 8712484629, నడికూడ సబ్ స్టేషన్ 8712484630 ఈ నంబర్లపై అందుబాటులో ఉంటారని తెలిపారు. విద్యుత్ సమస్యలు తలెత్తితే వినియోగదారులు వెంటనే ఈ నంబర్లను సంప్రదించి సమాచారం ఇవ్వాలని కోరారు.

తల్లిదండ్రులపై ఆర్థికభారాన్ని తగ్గించండి



వినతిపత్రం అందజేస్తున్న బీజేపీ మండల ప్రధాన కార్యదర్శి పొన్నాల రాజు

ఐనవోలు : ఒంటిమామిడిపల్లి ప్రభుత్వ పాఠశాలలో చదువుతున్న విద్యార్థుల తల్లిదండ్రులపై ఆర్థిక బారాన్ని తగ్గించాలని బీజేపీ మండల ప్రధాన కార్యదర్శి పొన్నాల రాజు అన్నారు. గురువారం ఒంటిమామిడిపల్లి ప్రభుత్వ పాఠశాలలో నెలకొన్న నిర్వహణ లోపాలు, ఆర్థిక అవకతవకల గురించి హెచ్‌ఎం సదానందానికి వినతిపత్రం అందించారు. గత విద్యా సంవత్సరం పీఎంశ్రీ, తల్లిదండ్రుల నుంచి సేకరించిన డబ్బుల జమ, ఖర్చుల వివరాలు పాఠశాల చివరి వర్కింగ్ డే రోజు తెలుపాల్సి ఉండగా కమిటీ ఇప్పటి వరకు పూర్తి వివరాలు వెల్లడించలేదన్నారు. కేవలం 8 మంది ప్రభుత్వ పాఠశాల ఉపాధ్యాయులు ఉన్నప్పుడు ప్రైవేటు ఉపాధ్యాయులను నియమించి నిర్వహణ కోసం పేరెంట్స్ నుంచి డబ్బులు వసూలు చేశారని గుర్తుచేశారు. ప్రస్తుతం 17 మంది టీచర్లు అందుబాటులో ఉండగా ఫీజులు గతంలో మాదిరిగా వసూలు చేయడం ఎందుకని ప్రశ్నించారు. పాఠశాల నిబంధనల మేరకు వసూలు చేసిన డబ్బులు బ్యాంకు ఖాతాలో జమచేయాల్సి ఉండగా అలా చేయడం లేదని ఆరోపించారు. వినతిపత్రం అందజేసిన వారిలో పెండ్లి తిరుపతి, రాజారపు కుమార్ ఉన్నారు.

పరిసరాల పరిశుభ్రత పాటించాలి



వైద్య పరీక్షలు చేస్తున్న డాక్టర్ నాగరాజు

కమలాపూర్ : వర్షాకాలంలో సీజనల్ వ్యాధులు ప్రబలకుండా ప్రతిఒక్కరూ వ్యక్తిగత పరిశుభ్రతతో పాటు పరిసరాల పరిశుభ్రత పాటించాలని వైద్యాధికారి నాగరాజు సూచించారు. మండలంలోని గోపాల్‌పూర్‌లో కమలాపూర్ పీహెచ్‌సీ ఆధ్వర్యంలో గురువారం ప్రత్యేక వైద్య శిబిరం నిర్వహించి సీజనల్ వ్యాధుల నివారణపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా 60 మందికి వైద్య పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. గ్రామంలో పర్యటించి పరిసరాల పరిశుభ్రతతో పాటు వ్యక్తిగత పరిశుభ్రతపై గ్రామస్తులకు అవగాహన కల్పించారు. వర్షాకాలం నేపథ్యంలో ఇళ్ల పరిసరాల్లో చెత్తాచెదారం, నీరు నిల్వకుండా చూసుకోవాలన్నారు. వారంలో రెండు రోజులు (మంగళ, శుక్రవారాల్లో) తప్పనిసరిగా డ్రై డే పాటించాలని కోరారు. అనారోగ్య సమస్యలు తలెత్తితే వెంటనే వైద్య సిబ్బందికి సమాచారం ఇవ్వాలని, సమీపంలోని ఆరోగ్య కేంద్రంలో వైద్య పరీక్షలు చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ రోహిత్, హెల్త్ అసిస్టెంట్స్ గోవర్ధన్, రాము, ఏఎన్‌ఎం సంపూర్ణ, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

ప్రభుత్వ భూమి, రోడ్డును కాపాడండి

కలెక్టర్‌కు ఫిర్యాదు చేసిన రైతులు

కమలాపూర్ : మండలంలోని అంబాల నుంచి ఎల్కతుర్తి మండలం కేశవాపూర్‌కు వెళ్లే మార్గంలో ఉన్న ప్రభుత్వ భూమిని, రోడ్డును ఆక్రమణదారుల నుంచి కాపాడాలని గ్రామస్తులు, రైతులు కోరారు. ఈ మేరకు గురువారం హనుమకొండ జిల్లా కలెక్టర్ ప్రావీణ్యకు ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా గ్రామస్తులు, రైతులు మాట్లాడుతూ అంబాల-కేశవాపూర్ మార్గంలో వ్యవసాయ పొలాలకు వెళ్లే రోడ్డును గ్రామానికి చెందిన కొందరు ఆక్రమించి ఇళ్లు, గోడలు కడుతున్నారని ఆరోపించారు. రోడ్డు, వారు ఇళ్లు కట్టే స్థలం సర్వే నంబరు 506లోని ప్రభుత్వ భూమి అని, వారికి అక్కడ పట్టాలు, అనుమతులు లేవని ఆరోపించారు. ఆ రోడ్డు నుంచి వ్యవసాయ భూములకు, గుట్టకు, చెరువుకు, పురాతన కాలం నాటి రామలక్ష్మణుల గుడికి, దర్గాకు వెళ్లే బాట ఉందని, ఆ రోడ్డును, ప్రభుత్వ భూమిని ఆక్రమించుకుని నిర్మాణాలు చేపడుతున్న కారణంగా రోడ్డు ఇరుకుగా మారి ట్రాక్టర్లు, వరి కోత మిషన్లు వెళ్లేందుకు ఇబ్బందులు తప్పడం లేదని తెలిపారు. గుట్టకు వెళ్లే లారీలు, పశువులు వెళ్లేందుకు అవకాశం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. మొగిలి, సారయ్య, రమేశ్ తెలిపారు.

ఎల్‌ఓసీ అందజేత

మడికొండ: కాజీపేట మండలం మడికొండ గ్రామానికి చెందిన దువ్వ గణేష్‌కు చికిత్స నిమిత్తం రూ.3లక్షల 50 వేల విలువగల ఎల్‌ఓసీని వర్ధన్నపేట ఎమ్మెల్యే నాగరాజు గురువారం అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యేకు బాధిత కుటుంబ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు. నాయకులు ఉన్నారు.